# కొన్ని కథలింతే!

## జి. నరసింహమూర్తి

వ్యవహారమెటూ తేలకుండా ఉంది.

సీతమ్మ కూతురు పెళ్లిచూపుల కొచ్చిన పెద్దలు ఆలోచనలో పడ్డారు.

అమ్మాయి అందమైంది. చదువుకున్నది. బి యిడి పాసై ఉంది. ఇల్లూ వాకిలీ అంతంత మాత్రమైనా వాటి గొడవ మగపెళ్లి వారికనవసరమే. అబ్బాయి ఇల్లరికం రానవసరంలేదు. రావాలన్న కోరిక లేదు.

పొద్దున్న వచ్చిన పెళ్లి పెద్దలు అటు వెళ్తున్నారు; యిటు వెళ్తున్నారు - సీతమ్మ యెప్పుడో పదహారు సంవత్సరాల క్రితం భర్తతో సంబంధాలు తెంచుకున్న ఆడది. కారణాలు యేమైనా భర్తను వదిలేసిందే అంటారు. గాని భర్త ఆమెను తన తోవన తాను వదిలి పోయాడని విశాలంగా ఆలోచించే వారుండరు.




పెద్దలు దీని వెనుకున్న రహస్యం మరింత బయటకు లాగాలని ఆ వీధి యీ వీధి ఆచూకీ తీస్తున్నారు. సీతమ్మ గురించి, ఆమె కూతురు గురించీనూ.

అమ్మాయిని చూస్తుంటే సంబంధం చూస్తూ వదులుకోలేక పోతున్నారు. తల్లి కూడా అణుకవైనది. మర్యాద సంస్కారం గలది.

పెళ్లిచూపుల కొచ్చిన నలుగురు మనుష్యులు వీధి చివర తారసపడిన ఓ వ్యక్తిని ఆపారు.

"మిమ్మల్ని ఆపినందుకు క్షమించాలి."

"ఫర్వాలేదు, చెప్పండి"

"ఆ పై వీధిలో సీతమ్మనే ఓ మొగుడు లేనావిడ ఉంటుంది. ఎటువంటిది?" ఒకాయన ప్రశ్నించాడు.

"చాలా మంచిది."

"మరి మొగుడు యెందుకు వదిలేశాడు?"

"ఆవిడది కాదు తప్పు - ఆమె మొగుడిదే"

"వాళ్లకింకెవరూ లేరాండి?"

"ఉన్నవాళ్లంతా మన వాళ్లవుతారా, మన వాళ్లంతా ఉన్నవాళ్లవుతారా - యెవరి తోవలు వారివి"

ఈ సమాధానంతో ఆ పెద్ద మనుషుల తల తిరిగిపోయింది. అతను చెప్పిన సమాధానం చాలా లోతుగా ఆలోచించాల్సిందే అనుమానాలు నివృత్తి చేసుకుని వచ్చిన పని నెరవేర్చుకు పోవాలని పెద్దలు కంగారు పడుతున్నారు.

"పని తొందర్లో ఉన్నట్టున్నారు. వెళ్లి రండి" అన్నాడు అందులో ఓ పెద్ద.

"దానికేముందిలెండి. నమస్తే" వెళ్లిపోయాడు ఆ ఆసామి.

అతనలా వెళ్తుండగానే మరో వ్యక్తి అలా రావడంతో,

"చూడండి బాబూ! ఆ పై వీధిలో సీతమ్మగారు, అంటే - ఒకర్తే కూతుర్తో ఉంటుంది మొగుడు లేకుండా - ఆమె మొగుడు యెక్కడుంటున్నాడు?" ప్రశ్నించాడు.

ఆ వ్యక్తి మందహాసం చేస "భలేగడుగుతున్నారు. యిప్పటిదాకా మీరు మాట్లాడారు, అంటే అదిగో ఆ వెళ్తున్నాయనే సీతమ్మగారి భర్త" అంటూ వెళ్తున్నాయన్ని చూపించాడు.

పెద్దలకు మతి పోయింది.

ఎవరి కోసం వెదుకుతున్నారో ఆ వ్యక్తినే అసలు విషయం ఆరా తీయడంకూడా జరిగిపోయింది.

"ఈయన యెక్కడుంటున్నాడు?"

"ఈ పక్క వీధిలో నే"


"మరి ఆవిడకూ ఈయనకూ యేసంబంధమూ లేదా?"

"వాళ్ళు విడిపోయి చాలా సంవత్సరాలయ్యింది. ఎవరి బ్రతుకులు వాళ్లవి. ఈయన మరో సంసారం పెట్టుకున్నాడు. పిల్లలు కూడాను. వాళ్లను పెంచుకుంటూ యేదో తన గొడవ తాను చూసుకుంటాడు. ఒక విధంగా చెప్పాలంటే స్వయంశక్తి మీద ఓ చిన్ని ఉద్యోగం చేసుకుంటూ కూతుర్ని బి.ఇ.డి. చదివించింది. ఈయన గారికంటే ఆమే ఓ స్థాయికొచ్చింది సంఘంలో" అన్నాడు.

పెద్దలు మరేమీ అడగలేదు.

వివాహం నిశ్చయమైపోయింది.

# ఈ వేమన పద్యాలు




స్నాన మొనరజేసి దానంబు సల్పక
నీళ్ల మునుగ దగునె నేర్పులేక
నీళ్లయందు గాకి నెలవుగా మునుగదా
విశ్వదాభిరామ వినుర వేమ.

సీతమ్మ ఆ వివాహం తన యింటనే జరిపించాల్సిందిగా కోతే మగపెళ్లివారు కాదనలేదు.

ఒక్క కూతురు పెళ్లి తన యింటే జరిగితే తద్వారా కలిగే సంతోషం కోసం ఆమె తపిస్తుందని గమనించారు!

అబ్బాయి కూడ యోగ్యుడు కావడం వలననూ అర్థం చేసుకోగలవాడు కనుకనూ పెళ్లి వ్యవహారం సవ్యంగానే సాగిపోయింది.

కట్న కానుకల విషయంలో పట్టింపుల్లేవు. చాలా సుహృద్భావంతో పెళ్లి కార్యక్రమాలు నడుస్తున్నాయి.

మగపెళ్లివారు వచ్చారు.

పెళ్లిపందిరి కలకల్లాడుతోంది.

సీతమ్మ ఒకర్తే అయినా సమర్థురాలు కనుక విందులూ, వడ్డింపులూ, మర్యాదలూ అన్నీ సక్రమంగా పర్యవేక్షిస్తోంది.

## కొన్ని కథలింతే!

ఆడది అంత చాకచక్యంగా కూతురి వివాహం నెరవేర్చుతున్నందుకు అందరికీ ఆశ్చర్యంగా ఉంది.

ముహూర్తం రాత్రి తొమ్మిది నలభై నిముషాలకు.

వధూవరులు పెళ్లి పీటల మీద కూర్చున్నారు.

పురోహితుడు ఘనంగా నెరవేర్చుతున్నాడు తన బాధ్యత.

పందింట్లో కూర్చున్న బంధుమిత్రులంతా ఉత్సాహంగా ఉన్నారు. అయినా తండ్రి లేని లత వివాహమిలా సాగుతున్నందుకు లోలోన సానుభూతి గాయం నుంచి స్రవిస్తున్న నెత్తురులా ఉంది.

ఎవరో అన్నారు సీతమ్మతో - "ఏమ్మా కన్నవాడు యిక్కడే ఉంటున్నాడుగా - పెళ్లికి పిలవకూడదూ?" అని.

"పిల్ల రెండో యేటనే మమ్మల్ని వదిలేసి వెళ్లిపోయిన ఆ మనిషిని పెళ్లికి రమ్మనడమెందుకు, రాక పోయిన తర్వాత మళ్లీ ఆ చెంప దెబ్బ తినడమెందుకు - ఆ గతాన్నంతా మళ్లీ కెలుక్కోవడమెందుకు" సీతమ్మ తనలోనే అనుకుంది.

"ముహూర్తం దగ్గర పడుతుంది. కన్యాదాత ఇలా రండి. త్వరగా రావాలి" అంటూ మంత్రాలు వల్లిస్తూ తాళి వగైరా తయారు చేస్తున్నాడు పురోహితుడు.

ఉన్నట్టుండి ఓ వ్యక్తి ముందుకొచ్చాడు.

అతను తిన్నగా లత పక్కగా నిలబడ్డాడు.

సీతమ్మ కూడా అక్కడే ఉంది.

అతనూ, సీతమ్మా పక్క పక్కనే ఉన్నారు.

పెళ్లి పందింట్లో కల కలం లేచింది.

సీతమ్మ అతని కళ్లల్లోకి చూసింది.

ఏవో స్వచ్ఛమైన భావలున్న ఆ చూపుల్లో చూపులు కలిశాయి.

"రామ్మూర్తిగారు - కూతురి పెళ్లికొచ్చారు" అంటున్నారెవరో.

"ఆహా యెంత శుభ ఘడియండి"

"కన్న కూతురే కదా"

"అవును. ఆ మమతానుబంధం అలా లాక్కొస్తుంది"

ఇలా అనుకుంటున్నారు.

పురోహితుడు తలంబ్రాల పళ్లెలు పందింట్లోకి పంపించేడు. అంతా సంతోషంగా తలంబ్రాలు గుప్పెట్లోకి తీసుకున్నారు! సీతమ్మ వెలితి గుండె అమృతంతో నిండిపోయింది. అనుకోకుండా ఆ పవిత్రక్షణం వెల్లివిరిసి పుష్పించింది.

"మీరు పెళ్లి కుమార్తెకు ఏమవుతారు?" పురోహితుడు అడిగేడు.

"తండ్రిని".

సీతమ్మకది చాలు.

కన్యాదానం చేయించాడు.

మాంగల్య ధారణ తాళమేళాల మధ్య బ్రహ్మాండంగా ముగిసింది.

తలంబ్రాలు పుష్పవర్షంలా కురిశాయి.

తతిమ్మా పెళ్లి కార్యక్రమాలు ముగిశాయి.

రామ్మూర్తి వధూవరుల నాశీర్వదించాడు అక్షంతలు వేసి.

సీతమ్మ నయనాల్లో ఆనందభాష్పాలు నిండాయి.

రామ్మూర్తి అక్కన్నుంచి వెళ్లిపోయే ఉద్దేశంతో పందిట్లోంచి బయటకొచ్చాడు.

సీతమ్మ కూడ బయటకొచ్చింది.

రామ్మూర్తి మౌనంగా ఉండిపోయాడు.

ఇద్దరి మధ్యా మాటల్లేవు.

"ఇలా వచ్చినందుకు నన్ను మన్నించు సీతా! మనిద్దరమూ యేనాడో విడిపోయినా మనిద్దరి మధ్యా ఆనాటి ప్రేమానురాగాలకు గుర్తుగా లత ఉంది. లత నా కూతురే కనుక ఈ శుభ సమయంలో నేను రావడం పొరపాటు లేదనుకుంటాను" రామ్మూర్తి ముందుకి నడిచాడు. □